క్లుప్తంగా

నేటితో ముగియనున్న చండీ హోమం


శ్రీకాత్యాయని పీఠంలో నిర్వహిస్తున్న చండీ హోమం

కొయ్యలగూడెం: శ్రీకాత్యాయని పీఠంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న చండీ హోమం సోమవారంతో ముగియనుంది. జూన్ 29న హోమాన్ని బ్రహ్మశ్రీ దాసరోజు శ్రీనివాసాచార్యులు ప్రారంభించారు. లోక కళ్యాణార్థం ప్రతి సంవత్సరం హోమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వర్షాలు సకాలంలో కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండేందుకు హోమాన్ని సంకల్పించినట్లు తెలిపారు. చివరి రోజున పూర్ణాహుతితో హోమం పరిసమాప్తి అవుతుందని అనంతరం భక్తులకు ప్రసాద వితరణ నిర్వహిస్తామన్నారు. కాగా హోమంలో భక్తులు ద్రవ్యాలను సమర్పించుకోవచ్చు అని ఆయన సూచించారు.

సేవల ద్వారానే ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తింపు


ఉదయకుమార్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: ప్రభుత్వ ఉద్యోగులు తమ సేవల ద్వారానే ప్రజల్లో గుర్తింపు పొందుతారని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎన్‌వీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మండవ ఉదయకుమార్ ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక వై.జంక్షన్ ఫంక్షన్ హాలులో ఆదివారం ఆయనకు సన్మాన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఈ మాట్లాడుతూ 40 సంవత్సరాల సుదీర్ఘ అనుభవంలో ఉదయ్ కుమార్ చేపట్టిన పనులను కొనియాడారు. ముఖ్యంగా తాగునీటి సమస్య పరిష్కారానికి ఉదయకుమార్ చేసిన కృషిని ఆదర్శంగా తీసుకుంటామని సహచర ఏఈలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉదయకుమార్ దంపతులను సత్కరించి మొమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో ఎం.రాజు, రిటైర్డ్ ఎస్ఈలు జేవీ రాఘవులు, రామారావు, ఈఈ త్రినాధబాబు, డీఈలు సత్యనారాయణ సురేష్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చదవడం మాకిష్టం

భీమడోలు: సామూహిక పుస్తక పఠనం ద్వారా విద్యార్థులకు విజ్ఞానం అందుతుందని పలువురు పేర్కొన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులు పాల్గొని నీతి పుస్తకాలు, జాతీయ నాయకులు జీవిత చరిత్రలు, ఆధ్యాత్మిక, జనరల్ నాలెడ్జికు చెందిన పుస్తకాలను చదివారు. వాటిపై సమీక్షలు రాశారు. నీతి కథలు వివరించారు. విద్యార్థులు ప్రతి నిత్యం గ్రంథాలయాలను సందర్శించి పుస్తకాలను పఠించి, దినపత్రికలను చదివి మరింత విజ్ఞానాన్ని పొందాలని గ్రంథపాలకుడు కోరారు. పుస్తక పఠనాసక్తిని పెంపొందించుకునే గ్రంథాలయాలు వేదికలన్నారు. పుస్తకం 100 మంది మిత్రులతో సమానమని వారికి వివరించారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథపాలకులు, పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడివాకలంక సర్పంచ్‌గా ఘంటసాల నాగరాజు ఎన్నిక

ఏలూరు రూరల్ : గుడివాకలంక సర్పంచ్‌గా (అనధికార) ఘంటసాల నాగరాజు ఎన్నికయ్యాడు. సమీప ప్రత్యర్థి జయమంగళ దొరబాబుపై 18 ఓట్ల మెజారిటీతో విజయం సాధించాడు. ఆదివారం ఉదయం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులు జయమంగళ బాలకృష్ణ, పతాని బలే చక్రవర్తి పర్యవేక్షణలో పెద్దలు పోలింగ్ చేపట్టారు. 1 బంటా గ్రూప్ నుంచి 30 మంది చొప్పున మొత్తంగా 10 బీసీ బంటాలు, 1 ఎస్సీ బంటాకు చెందిన 330 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. గ్రామ కట్టుబాటు ప్రకారం ప్రజలు, బంటా పెద్దలు కలిసి గ్రామ సర్పంచ్‌గా ఒక వ్యక్తిని ఎన్నుకుంటారు. తిరిగి అదే వ్యక్తి ఎన్నికల సంఘం నిర్వహించే పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ వేస్తే, ప్రజలు అధికారిక సర్పంచ్‌గా ఎన్నుకుంటారు. కట్టుబాట్లు ప్రకారం 2020లో ఎన్నుకోబడిన జయమంగళ ప్రభావతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరురాలు కావడంతో పచ్చనేతలు ఆమెను రాజీనామా చేయించారు. ఆమె స్థానంలో టీడీపీకి చెందిన నాగరాజు, దొరబాబు ఇప్పుడు పెద్దలు నిర్వహించిన ఎన్నికల్లో పోటీపడ్డారు.

నలుగురు జూదరుల అరెస్ట్

జంగారెడ్డిగూడెం: స్థానిక ముత్రాసుల పేటలో ఆదివారం కోడిపందేలపై దాడి చేసినట్లు ఎస్సై జ్యోతిబాస్ తెలిపారు. ఈ దాడిలో కోడిపందేలు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వీరినుంచి రూ.1050 నగదు, ఒక కోడిపుంజు, ఒక కోడి కత్తి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పచ్చిరొట్ట సాగుతో బహుళ ప్రయోజనాలు

చింతలపూడి: జిల్లాలో ఖరీఫ్ సీజన్ పనులు మొదలయ్యాయి. తొలకరి వర్షాలు ప్రారంభం కావడంతో జిల్లాలో 2,33,739 ఎకరాల్లో వరి సాగు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం అవసరమైన విత్తనాలను కూడా ప్రభుత్వం సిద్ధం చేసింది. ఏపీ సీడ్స్, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడానికి వ్యవసాయశాఖ అందుబాటులో ఉంచింది. ఈ పరిస్థితుల్లో రైతులు భూసారాన్ని పెంచుకోవడానికి పచ్చిరొట్ట సాగు చేసుకోవాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. జిల్లాలో సుమారు 5 వేల క్వింటాళ్లకు పైగా పచ్చిరొట్ట విత్తనాలను ఏటా రైతులకు సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తోంది.


మెట్ట ప్రాంతంలో సాగు చేస్తున్న పచ్చిరొట్ట


గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకంలో భాగంగా రైతులకు రాయితీపై ఎంటీయూ 1061 ఫౌండేషన్ సీడ్‌ను పంపిణీ చేస్తున్న అధికారులు

మెట్ట భూముల్లో తగ్గుతున్న పోషకాలు

మెట్ట ప్రాంత వ్యవసాయ భూముల్లో రానురాను స్థూల, సూక్ష్మ పోషక పదార్థాలు తగ్గిపోతున్నాయి. పూర్వం గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపద ఎక్కువగా ఉండటం వల్ల పశువుల ఎరువు పుష్కలంగా లభించేది. దీన్ని రైతులు సేంద్రియ ఎరువుగా వాడేవారు. ఈ మధ్య కాలంలో రసాయన ఎరువుల వాడకం అధికమవ్వడంతో భూసారం దెబ్బతింటోంది. భూమి నుంచి పైరుకు పోషకాలు అందడం లేదు. దీంతో దిగుబడి తగ్గడమేకాక చీడ, పీడల ఉధృతి పెరిగిపోతుంది. భూసారాన్ని పెంచడానికి రైతులు కనీసం రెండు పంటలు వేసిన తరువాత ఒకసారి పచ్చిరొట్ట పైర్లు సాగుచేయాలని వ్యవసాయ శాఖ సూచిస్తుంది.

పచ్చిరొట్ట వల్ల ఉపయోగాలు

పచ్చి రొట్ట సాగు వల్ల భూసారం పెరగడమే కాక చీడ, పీడల బెడద తగ్గుతుంది. దిగుబడులు గణనీయంగా పెరుగుతాయి. భూసారం పెంచే పచ్చిరొట్ట పైరులైన జనుము, జీలుగ, పిల్లి పెసర సాగు చేసి ప్రయోజనం పొందవచ్చు. సేంద్రియ పదార్థాలను నేలకు అందించడం, కలుపు మొక్కలను నివారించడం, నేలలో జీవ రాశులకు ఆహారంగా, మొక్కలకు కావలసిన అన్ని పోషక పదార్థాలను అందించే సాధనాలుగా పచ్చిరొట్ట పైర్లు ఉపయోగ పడతాయి.

నత్రజని వాడకాన్ని ఆదా చేయవచ్చు

ప్రస్తుతం పొలాలకు కృత్రిమంగా ఉపయోగిస్తున్న నత్రజని వాడకాన్ని 20 నుంచి 30 శాతం వరకూ ఆదా చేసుకోవచ్చు. పచ్చిరొట్ట పైర్లు సాగు చేసిన భూముల్లో పంటలు ఆరోగ్యంగా పెరిగి, చీడ, పీడలను తట్టుకోవడమే కాకుండా నేలలో నీరు, రసాయన ఎరువులు భూమి కింది పొరలకు జారిపోకుండా పచ్చిరొట్ట అడ్డుకుంటుంది. నేలలో చౌడును తగ్గించి శీతాకాలంలో కూడా నేలలోని ఉష్ణోగ్రత సమతుల్యంగా ఉండటానికి పచ్చిరొట్ట సాగు ఉపకరిస్తుంది. చౌడు భూముల్లో జీలుగ, నీరు నిల్వ ఉండే భూముల్లో జనుము వేసుకోవడం ఉత్తమం.

ఎంత మోతాదులో విత్తాలి

జీలుగ హెక్టారుకు 20 టన్నులు, జనుము 21 టన్నులు, పిల్లి పెసర 18 టన్నుల దిగుబడి వస్తుంది. ఇటు పశుగ్రాసం కొరతను తీర్చడమే కాక భూమిని సారవంతం చేస్తాయి. ఎరువు కోసమైతే పచ్చిరొట్ట పైర్లను పూత సమయంలో నేలలో కలియదున్నుకోవాలి. పైరు వయసు 50 రోజుల నుంచి 60 రోజులు మించకుండా కలియదున్ని ఒకటి రెండు వారాల తరువాత నాట్లు వేసుకోవాలి. జీలుగ పిల్లి పెసర విత్తనాలు ఎకరానికి 16 కిలోలు, జనుము 20 కిలోల చొప్పున వేసుకోవాలి. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై రైతులకు పచ్చి రొట్ట విత్తనాలు అందిస్తోంది. ప్రస్తుతం ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు కావలసిన పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.

భూసారం పెంచుకోవచ్చు



రైతులు పచ్చిరొట్ట సాగు చేసుకుని భూసారాన్ని పెంచుకోవచ్చు. రాయితీపై విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్నాం. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే రైతులు మంచి దిగుబడులు సాధించవచ్చు. సబ్ డివిజన్‌లో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ ముమ్మరంగా సాగుతోంది.

– బి నాగకుమార్, వ్యవసాయ సబ్‌డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్

పచ్చిరొట్ట సాగు ఎంతో ఉపయోగం



ఖరీఫ్ వ్యవసాయానికి ముందు పచ్చిరొట్ట సాగు చేయడం వల్ల భూముల్లో చౌడును నివారించుకుంటున్నాం. పచ్చిరొట్ట సాగుతో రసాయన ఎరువుల అవసరం కూడా తగ్గుతుంది. నాణ్యమైన పంట దిగుబడులు వస్తున్నాయి.

– చేపూరి ఖాదర్‌బాబు, రైతు, శెట్టివారిగూడెం

కార్పొరేట్‌కు దీటుగా బోధించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు మరింత సమర్థవంతంగా పాఠ్యాంశాలను బోధించాలని, చిత్తశుద్ధితో సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి సూచించారు. జిల్లా కలెక్టర్‌గా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన వెట్రిసెల్విని కలెక్టరేట్ చాంబర్లో డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎం అచ్యుతరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి, పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచే విధంగా ఉపాధ్యాయులు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఇంటింటికీ తిరిగి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో లభిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసి వారిని ప్రభుత్వ పాఠశాల వైపు ఆకర్షించేలా చేయాలన్నారు. పాఠ్య, నోట్‌పుస్తకాలు, బ్యాగులు, యూనిఫారం, షూస్, టై, బెల్ట్ అందజేయడంతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు సరఫరా చేయాలని అన్నారు. విద్యార్థుల స్థాయిని తెలుసుకుని బోధన చేసి వారి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర బాధ్యుడు ఆర్ నాగేంద్ర సింగ్, జిల్లా అధ్యక్షుడు నేతల ఆజాద్ తదితరులు ఉన్నారు.

ధాన్యం బకాయిలు చెల్లించాలి

దెందులూరు: జిల్లాలోని రైతాంగ సమస్యలను పరిష్కరించి అన్నదాతలను ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె శ్రీనివాస్ కోరారు. ఆదివారం దెందులూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం విక్రయించిన రైతులకు ఇవ్వాల్సిన రూ.240 కోట్ల ధాన్యం బకాయి సొమ్ములు వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగించేందుకు జారీ చేసిన జీవో 22ను రద్దు చేయాలన్నారు. సమగ్ర భూ సర్వేలో జరిగిన లోపాలను సరిచేసి ఖచ్చితమైన పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలన్నారు. సమగ్ర పంటల బీమా పథకాన్ని తీసుకురావాలని, పంటల బీమా ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలన్నారు. భూయజమానుల సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, వడ్డీ లేని పంట రుణాలు, నష్టపరిహారాలు ఇవ్వాలన్నారు. కనీస ధర రాక నష్టపోతున్న కొబ్బరి రైతులను ఆదుకునేందుకు కొబ్బరి కొనుగోలు కేంద్రాలు తెరవాలన్నారు. సీడ్ మొక్కజొన్న విత్తన కంపెనీలపై ప్రభుత్వ అజమాయిషీ ఉండాలన్నారు. సీడ్ మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులకు విత్తన కంపెనీల నుంచి అగ్రిమెంట్స్ ఇప్పించాలన్నారు. ఆక్వా రైతులకు విద్యుత్ యూనిట్ రూ.1.50కే ఇవ్వాలని, ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఆయిల్‌పామ్ టన్ను గెలలకు రూ.18 వేలు ధర ప్రకటించాలని, తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా ద్వారకాతిరుమల, దెందులూరు మండలాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

కార్మిక రంగ సమస్యలను పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): అసంఘటిత రంగం కార్మికుల బోర్డులను వెంటనే తెరిపించాలని, భవన నిర్మాణ, హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డును పరిరక్షించాలని, పెండింగ్ క్లెయిమ్‌లను విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేవీ రమణ, బద్దా వెంకట్రావు డిమాండ్ చేశారు. స్థానిక ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో కేవీ రమణ అధ్యక్షతన ఇఫ్టూ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. రమణ, వెంకట్రావు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వాలు కార్మిక రంగంలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ రామ్మోహన్, పి.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఇ.గ్రీష్మ కుమార్, ఎండీవీ ప్రసాద్, కె.అప్పారావు, కె.శ్రీనివాస్, జి.రాంబాబు, మంగం అప్పారావు, పి.గంగరాజు, ఎస్ నెహ్రూ బాబు, ఎం రాము తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి


లింగపాలెంలో వైఎస్సార్ సీపీ మండల ముఖ్యనేతలతో మాట్లాడుతున్న బీవీఎస్ రెడ్డి

లింగపాలెం: వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని ఆ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి అన్నారు. ఆదివారం లింగపాలెంలోని ఆయన గెస్ట్ హౌస్‌లో పార్టీ ముఖ్యనేతలతో చర్చించారు. ఈ సందర్భంగా బీవీఎస్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. కాని కొన్ని గ్రామాల్లో టీడీపీ శ్రేణులు వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులకు పాల్పడటం, వైఎస్సార్ సీపీకి చెందిన వారి భూముల్లో చెట్లు నరకటం, పొలాల్లో కట్టవాలు తొలగించటం వంటివి చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. రాజకీయ పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవని, ఇది గమనించాలని టీడీపీ నేతలకు హితవు పలికారు. తాను ప్రజలకు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని బీవీఎస్‌రెడ్డి తెలిపారు. ప్రజల మద్దతు ఉన్నందునే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి 40 శాతం ఓట్లు పోలయ్యాయని గుర్తుచేశారు. గ్రామస్థాయిలో పార్టీని మరింతగా బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కలిసి కృషిచేద్దామన్నారు. 2029 ఎన్నికల్లో పార్టీ అధినేత వైస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా సీఎంను చేసేందుకు సమష్టిగా కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, సర్పంచ్‌లు తాడేపల్లి శాంతరావు, కట్టు బోయిన రమేష్, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ముసునూరి వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, నాయకులు బి ప్రసాద్‌రెడ్డి, రావి కొండయ్య, ఎం.లోక్‌నాథరెడ్డి, నూతలపాటి శ్రీను, గణష్, బి.ప్రభాకర్‌రెడ్డి, తగరం జయరాజు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలి


రిటైర్డ్ సబ్‌జైల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

చింతలపూడి: విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించినప్పుడే ఆత్మ సంతృప్తి కలుగుతుందని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు అన్నారు. స్థానిక సబ్‌జైల్ సూపరింటెండెంట్ గోలి వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వరరావు సబ్‌జైల్ ఖైదీల్లో పరివర్తన తీసుకురావడానికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. జిల్లా సబ్ జైళ్ల అధికారి అప్పల నాయుడు మాట్లాడుతూ జైళ్ల శాఖలో వెంకటేశ్వరరావు 40 ఏళ్లు సేవలు అందించారని, తన విధినిర్వహణలో నిజాయితీగా వ్యవహరిస్తూ ఉన్నత అధికారుల ప్రసంశలు అందుకున్నారని చెప్పారు. అనంతరం వెంకటేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నూతన సబ్‌జైల్ సూపరింటెండెంట్ కృపానందం, సోషల్ వర్కర్ అక్బర్ ఆలీ, సబ్‌జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌లో మహిళల ప్రాధాన్యత పెరగాలి

లయన్స్ క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ పంకజాక్షన్


నూతన మహిళా అధ్యక్షులచే ప్రమాణస్వీకారం చేయిస్తున్న దృశ్యం

చింతలపూడి: లయన్స్ క్లబ్‌లో మహిళల ప్రాధాన్యత పెరగాలని, సేవా దృక్పథం ఉన్నవారు లయన్స్ క్లబ్‌లో చేరి తమ సేవలు అందించాలని లయన్స్ క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ పంకజాక్షన్ పిలుపునిచ్చారు. గోలి రంగారావు, రామానుజమ్మ లయన్స్ సేవా కేంద్రంలో చింతలపూడి లయన్స్‌క్లబ్‌తో పాటు ప్రగడవరం, యర్రంపల్లి, టి నరసాపురం లయన్స్ క్లబ్‌ల నూతన పాలకవర్గాల ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పంకజాక్షన్ హాజరయ్యారు. జీఎస్‌టీ కోఆర్డినేటర్ పీఎంజేఎఫ్ చిల్లపల్లి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఈ సంవత్సరం చింతలపూడి పరిధిలోని 4 క్లబ్బుల్లో 3 క్లబ్బులకు మహిళలనే అధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఎన్నికైన చింతలపూడి లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు చిల్లపల్లి విజయలక్ష్మి, యర్రంపల్లి క్లబ్ అధ్యక్షురాలు జగ్గవరపు మాధవి, ప్రగడవరం క్లబ్ అధ్యక్షురాలిగా ముల్లంగి విలాస కుమారి, టి నరసాపురం క్లబ్ అధ్యక్షునిగా ముసునూరి బాలస్వామిలతో పంకజాక్షన్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆర్‌సీలు యర్రంరాజు, రత్నకుమార్, జెడ్‌సీలు వల్లి కృష్ణవేణి, ఎ పవన్‌కుమార్, గోలి చంద్రశేఖర్‌రెడ్డి, చుండూరు అబ్బయ్య, చిక్కాల సుధాకర్, ఎస్ఎస్ఎన్ గాంధి, పెద్దిన ప్రసాద్, జంగా చెన్నకేశవరెడ్డి, వేమారెడ్డి, కృష్ణారెడ్డి, గద్దమడుగుల రాజేష్ నాయుడు, కె శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి


ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

జంగారెడ్డిగూడెం: ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. జూలై 1వ తేదీన అధికారులు ఇంటి వద్దకే వచ్చి పెన్షన్‌లు అందిస్తారన్నారు. దీనికి కూటమి నాయకులు అందరూ సమన్వయంతో సహకరించాలని కోరారు. పింఛన్ లబ్ధిదారులకు రూ.7 వేలు చొప్పున పింఛన్ పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. 28 వర్గాలకు చెందిన 65,18,496 మంది పెన్షన్ లబ్ధిదారులకు జూలై 1వ తేదీ నుంచి పెంచిన పింఛన్లను ఇంటి వద్దే అందిస్తామన్నారు. ప్రతి శనివారం ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, పర్యటనా సమయంలో అధికారుల పనితీరు బాగోకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రావూరి కృష్ణ, పెనుమర్తి రామ్‌కుమార్, పారేపల్లి రామారావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు మహంకాళి రాంబాబు, మహంకాళి బాలకృష్ణ, కొనకళ్ల సోంబాబు, వందనపు వెంకటేశ్వరరావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఖజానా బాతుల కళకళ


గోసంరక్షణశాలలో ఉన్న టర్కీ కోళ్లు


సందడి చేస్తున్న ఖజానా బాతులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ఖజానా బాతులు సందడి చేస్తున్నాయి. కొండపైన గోసంక్షణశాలలో భక్తులకు అవి కనువిందు చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. నాలుగేళ్ల క్రితం ఒక భక్తుడు శ్రీవారి గోసంరక్షణశాలకు 4 ఖజానా బాతులను బహుమతిగా అందించాడు. సంతతి వృద్ధి చెందడంతో వాటి సంఖ్య 32కు చేరింది. ఈ ఖజానా బాతులతో పాటు సాధారణ బాతుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఇదిలా ఉంటే గోసంరక్షణశాలలోకి పాములు ప్రవేశించకుండా ఉండేందుకు ఒక భక్తుడు ఇటీవల బహుకరించిన టర్కీ కోళ్లు ఖజానా బాతుల వెంట తిరుగుతూ వాటికి రక్షణ కల్పిస్తున్నాయి.

వానాకాలం.. వ్యాధుల కాలం

- డయేరియా, జ్వరాలు, సీజనల్ వ్యాధులపై అప్రమత్తం
- మలేరియా కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న అధికారులు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యాధికారులు


దోమల నివారణకు స్ప్రేయింగ్ పనులను చేస్తున్న దృశ్యం


రెడ్డిగణపవరంలో డ్రెయినేజీలను శుభ్రం చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: ప్రస్తుతం వానాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంది. ముఖ్యంగా మలేరియా జ్వరాలు, డయేరియా, కామెర్లు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఇప్పటికే గిరిజన ప్రాంతంలో టైఫాయిడ్, మలేరియా, అక్కడక్కడ డయేరియా కేసులు నమోదవుతున్నాయి. వీటి నివారణపై అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి

గ్రామాల్లోని డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. డ్రెయినేజీలను శుభ్రం చేస్తూ చెత్తను తొలగిస్తున్నారు. అదేవిధంగా మంచినీరు ట్యాంక్‌లను శుభ్రం చేస్తూ క్లోరినేషన్ చేస్తున్నారు. అలాగే ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

గిరిజన ప్రాంతంలో మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలకుండా దోమల నివారణకు మలేరియా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా గ్రామాల్లో మొదటి విడత దోమల నివారణ మందు స్ప్రేయింగ్ పనులు చేస్తున్నారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల పరిధిలో ఇప్పటివరకూ 59 గ్రామాల్లో మొదటి విడత మలాథియాన్ స్ప్రేయింగ్ పనులు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే సుమారు 14 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో కూడా స్ప్రేయింగ్ పనులు పూర్తి చేసినట్లు అధికారులు చెప్తున్నారు.

ప్రజలకు అవగాహన అవసరం

గిరిజన ప్రాంతంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కలిగించేందుకు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. అలాగే గ్రామాల్లోని ఇళ్లల్లో నీటి నిల్వలు ఉండకుండా చూడటం, బ్లీచింగ్ చల్లించడం వంటి కార్యక్రమాలు చేస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇంటి పరిసరాల్లో, ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- ఖాళీ కొబ్బరి బోండాలు, టైర్లు, రుబ్బురోళ్లు, కూలర్లు, తొట్టెల్లో నీరు నిల్వ ఉంటే దోమలు చేరే అవకాశం ఉంటుంది.
- వాడకం నీరు ఎప్పటికప్పుడు బయటకు వెళ్లే మార్గం ఏర్పాటు చేసుకోవాలి.
- ఇంటి తలుపులు, కిటికీలు మూసి ఉంచాలి.
- ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దోమతెరలను వినియోగించుకోవాలి.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పోలవరం డివిజన్
90102 23729
99122 20559
95055 08399 (చింతలపూడి)
Office mail : tpgadvt@gmail.com